మొహర్రంను శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి

బహదూర్‌పురా: మొహర్రం సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం సాలార్‌జంగ్ మ్యూజియంలో జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ..మొహర్రం మరియు బీబీకా అలం ఊరేగింపులను ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పోలీసు శాఖ ముందస్తుగా అన్ని చర్యలు చేపట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో విక్రమ్ సింగ్‌మాన్ ఐపీఎస్, అడిషనల్ సీపీ, లా అండ్ ఆర్డర్, పి.రియాజ్ ఉల్ హసన్, ఎఫ్ ఎండీ, ఎమ్మెల్సీ జాఫర్‌హుస్సేన్, పోలీసు ఉన్నతాధికారులు, జీహెచ్‌ఎంసీ, ఆర్ అండ్ బీ, వాటర్వ్క్స్, విద్యుత్, వైద్య, ఆరోగ్య, అగ్నిమాపక, నెహూ జూలాజికల్ పార్క్ తెలంగాణ వక్ఫ్ బోర్డు, హెచ్‌ఈహెచ్ నిజాం రిలిజియస్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

కష్టపడి పని చేసే వారికి కాంగ్రెస్‌లో సముచిత స్థానం


దీపాదాస్ మున్షీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ధన్‌రాజ్, మేడికొండ కుమార్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ బీఆర్‌ఎస్ నాయకుడు, గ్రేటర్ హైదరాబాద్ దళిత గ్రాడ్యుయేట్ ఫోరం అధ్యక్షుడు ఎస్.ధన్‌రాజ్ తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ధన్‌రాజ్‌కు పార్టీ కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా ధన్‌రాజ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో కష్టించి పనిచేసే నాలాంటి కార్యకర్తలకు, నాయకులకు సముచిత స్థానం ఉంటుందన్నారు. గతంలో దివంగత మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ ఆధ్వర్యంలో గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేశానన్నారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, గ్రేటర్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అండదండలతో గోషామహల్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ధన్‌రాజ్ పేర్కొన్నారు. అదేవిధంగా కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన మేడికొండ కుమార్‌తో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేణుగోపాల్‌రావు, మాజీ డైరెక్టర్ టి.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

'రిటైర్డ్ అయినవారికి మళ్లీ ఉద్యోగాలు ఇవ్వొద్దు'


ప్రొఫెసర్ కోదండరాంను కలిసిన పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: వాటర్‌బోర్డులో రిటైర్డ్ అయిన వారికి మళ్లీ ఉద్యోగ అవకాశాలు ఇవ్వొద్దని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గతంలో 10 ఏళ్ల పాటు బీఆర్‌ఎస్ ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులకు, అధికారులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ నిరుద్యోగులకు నట్టేట ముంచిందన్నారు. ప్రొఫెసర్ కోదండరాంను ఆయన మంగళవారం కలిసి మెమోరాండం అందజేశారు. అనంతరం పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..మెట్రో వాటర్‌బోర్డులో జరుగుతున్న రిటైర్డ్ ఉద్యోగుల ప్రక్రియపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రొఫెసర్ కోదండరాం సానుకూలంగా స్పందించారు. వాటర్ బోర్డులో జరుగుతున్న రిటైర్డ్ ఉద్యోగుల ప్రక్రియను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఇక ముందు నిరుద్యోగులకే అవకాశాలు కల్పించే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిమూలం శంకర్, శివకుమార్, పోల్కం వినయ్‌రాజ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

డాక్టర్ వినయ్‌కుమార్‌కు వైద్యరత్న అవార్డు


అవార్డు అందుకుంటున్న డాక్టర్ వినయ్‌కుమార్ మంతటి

జియాగూడ: మదర్ ఫౌండేషన్ వారు వైద్యరత్న అవార్డు–2024 అందజేయడం సంతోషంగా ఉందని కిమ్స్ ఆసుపత్రి పిల్లల వైద్యుడు డాక్టర్ వినయ్‌కుమార్ మంతటి అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో జరిగిన జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మదర్ ఫౌండేషన్ వారు జియాగూడకు చెందిన డాక్టర్ వినయ్‌కుమార్‌కు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వైద్యునిగా మరింత సేవలందించడానికి అవార్డు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పి.జయప్రకాష్, జయశ్రీ, ధృవిక, మృణాళి, రవళి, నవీన్‌కుమార్, అర్జున్‌కుమార్, విజయలక్ష్మి, మంతటి నర్సిములు పాల్గొన్నారు.

మైత్రి కమిటీ సభ్యుల సేవలు స్ఫూర్తిదాయకం



విజయనగర్‌కాలనీ: మైత్రి కమిటీ సభ్యుల సేవలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని నగర కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆసిఫ్ నగర్ మైత్రికమిటీ అధ్యక్షుడు మీర్జా యాసీన్ అలీబేగ్‌ను కమిషనర్ సన్మానించారు. ఈ సందర్భంగా యాసీన్ అలీబేగ్ మాట్లాడుతూ..ఉన్నతాధికారుల ప్రశంసలు తమకు మరింత బాధ్యతను పెంచడంతో పాటు నూతన ఉత్సాహాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. రాబోయే మొహర్రం, వినాయక చవితి, బోనాల పండుగ ఉత్సవాల్లో తమ సభ్యులు మరింత ఉత్సాహంగా సేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆసిఫ్‌నగర్ జాయింట్ సెక్రెట్ అశ్వక్ అహ్మద్, ఆజం బాబా తదితరులు పాల్గొన్నారు.

బోనాల వేడుకలకు భారీ ఏర్పాట్లు చేయాలి


వేడుకల్లో పాల్గొన్న ఆనంద్‌కుమార్ గౌడ్, జంగయ్య తదితరులు

అఫ్జల్‌గంజ్: బోనాల వేడుకలకు కాంగ్రెస్ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేయాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గంతో పాటు గ్రేటర్ నలుమూలలా నిర్వహించే బోనాల వేడుకలకు జీహెచ్‌ఎంసీ, వాటర్‌బోర్డు, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, ఇతర శాఖల అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేయాలన్నారు. మంగళవారం పురానాపూల్ కనకదుర్గా ఆలయం నుంచి బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వరకు బోనాలు తీసుకుని వెళ్లారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకుడు జంగయ్య ఆధ్వర్యంలో కనకదుర్గ ఆలయంలో పూజలు చేశారు. ఆనంద్‌కుమార్ గౌడ్ వేడుకల్లో పాల్గొని ప్రసంగించారు. గోశాల నిర్వాహకుడు పగిడి సంతోష్‌నాయుడు, సుధాకర్, కిరణ్, భరత్, వీఎస్ ఆర్ సతీష్, చిన్న, నాగరాజు, రాములు పాల్గొన్నారు.

గోల్కొండ జూనియర్ కళాశాలలో వనమహోత్సవం


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

గోల్కొండ: కళాశాల ప్రాంగణాన్ని పచ్చని హారంగా తయారు చేయాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన గోల్కొండ రిసాలబజార్‌లోని బీజేఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరిగిన వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన బల్దియా డిప్యూటీ కమిషనర్ శిరేఖతో కలిసి కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ జూనియర్ కళాశాలను మజ్లిస్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చొరవతో ప్రారంభించడం జరిగిందన్నారు. అనతికాలంలోనే ఈ కళాశాల నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెంబర్ వన్‌గా నిలిచిందని అన్నారు. అనంతరం ఆయన కళాశాల ప్రిన్సిపాల్ జి.మాధవితో కలిసి కళాశాల అధ్యాపకులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, కళాశాల అధ్యాపకులు ప్రణీత, జహారాబేగం, నిర్మలదేవి, గులాంజహంగీర్, మజ్లిస్ నాయకులు ఆరూన్‌ఫరాన్, అజీజ్‌ఖాన్ పటాన్ తదితరులున్నారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

- మీరాలంమండిలో పేరుకుపోతున్న చెత్తాచెదారం
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం


మీరాలంమండిలో పేరుకుపోయిన చెత్తకుప్పలు

చార్మినార్: పాతబస్తీ ప్రజలకు నిత్యం కూరగాయలు సరఫరా చేసే మీరాలంమండిలో పారిశుద్ధ్య సమస్య కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఎప్పటికప్పుడు ఎత్తని చెత్తకుప్పలతో అటు రైతులు, వ్యాపారులు, ఇటు వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మీరాలంమండిలోని కూరగాయల మార్కెట్‌లో ఎప్పటికప్పుడు చెత్తకుప్పలను తొలగించాలని కోరుతున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదని ఇక్కడి వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఉదయం మాత్రమే చెత్తకుప్పలను తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది తిరిగి మళ్లీ అటు వైపు చూడకపోవడంతో రోజంతా రోడ్లపై చెత్తకుప్పలు గుట్టలుగా పేరుకుపోతున్నాయంటున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో అనారోగ్యాలకు గురయ్యే పరిస్థితులున్నందున ఎప్పటికప్పుడు చెత్తకుప్పలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. చిన్నపాటి వర్షానికే మీరాలంమండిలోని రోడ్లన్నీ మురికిగా తయారవుతున్నామంటున్నారు.

అధికారులు పట్టించుకోవాలి..



మీరాలంమండి కూరగాయల మార్కెట్‌లో చెత్తకుప్పలను తొలగించే విధంగా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇక్కడ పారిశుద్ధ్య సమస్య తలెత్తుతుంది. పక్కనే ఉన్న అమ్మవారి ఆలయంలో పూజలు చేయడానికి వెళ్లే భక్తులు సైతం పలు ఇబ్బందులకు గురవుతున్నారు. జోనల్ కమిషనర్‌తో పాటు ఏఎంహెచ్‌ఓలు క్షేత్ర స్థాయి పరిశీలన చేసి తగిన చర్యలు తీసుకోవాలి.

– కాట ఆదిత్య, మీరాలం మండి

బుజిలీ మహంకాళి ఆలయ చైర్మన్‌గా పరమేష్‌కుమార్

లంగర్‌హౌస్: లంగర్‌హౌస్‌లోని ప్రధాన అమ్మవారి ఆలయ బుజిలీ మహంకాళి ఆలయ చైర్మన్‌గా బోగి పరమేష్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా అరవింద్‌ను, ట్రెజరర్‌గా మధుని లంగర్‌హౌస్ పెద్దలు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పరమేష్‌కుమార్ మాట్లాడుత..గోల్కొండ బోనాల ఊరేగింపు సందర్భంగా మొదటి పూజ నిర్వహించే బుజిలీ మహంకాళి ఆలయ చైర్మన్ బాధ్యతలు తనకు అప్పగించడం చాలా సంతోషంగా ఉందన్నారు. మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్ తదితరులు పరమేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

మెట్టు సాయికుమార్‌కు శుభాకాంక్షలు


మెట్టు సాయికుమార్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న వినోద్‌కుమార్

నాంపల్లి: తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కో ఆపరేటివ్స్ సొసైటీ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మెట్టు సాయికుమార్‌ను మంగళవారం శాంతినగర్‌లోని తన కార్యాలయంలో పలువురు నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. న్యాయవాది ఆర్.వినోద్‌కుమార్ నేతృత్వంలో మెట్టు సాయికుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు మహ్మద్ ముజఫర్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



గోల్కొండ: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది ఎప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన గోల్కొండ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా ఆయన ఆసుపత్రి ఫార్మసీని సందర్శించారు. అందుబాటులో ఉన్న మందుల స్టాక్, రిజిస్టర్‌లలో ఉన్న స్టాక్‌తో సరిపోతుందా అనేది ఆయన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహరుల్లాను అడిగి తెలుసుకున్నారు. డెంగీ, సీజనల్ వ్యాధులు సోకిన వారు ఆసుపత్రికి వస్తే వారికి అందిస్తున్న వైద్య వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఆసుపత్రి ల్యాబ్‌ను సందర్శించారు. కార్పొరేటర్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

ఆసుపత్రి బాత్రూంలో జారి పడి కేన్సర్ రోగి మృతి

నాంపల్లి: ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రిలో ఓ రోగి బాత్రూంలో కాలుజారి పడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటన నాంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..యాకుత్‌పురాకు చెందిన మహ్మద్ రషీద్(55) రెండన్నరేళ్లుగా కేన్సర్‌తో బాధపడుతున్నారు. చికిత్స నిమిత్తం రెడ్ హిల్స్‌లోని ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రిలో చేరారు. ఈ నెల 7న కీమో థెరపీ కోసం వచ్చిన మహ్మద్ రషీద్ ఆసుపత్రిలోని బాత్రూంకు వెళ్లి కాలు జారి కిందపడ్డారు. గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలపై పోరులో చతురతను ప్రదర్శించాలి

నాంపల్లి: సమస్యలపై పోరాటంలో చతురత ప్రదర్శించాలని తెలంగాణ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరామ్ ఉద్యోగ సంఘాల నేతలకు హితబోధ చేశారు. మంగళవారం రాత్రి నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో టీఎన్జీఓ ఆధ్వర్యంలో సమస్యల సాధన సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడారు. గత ప్రభుత్వం అవసరం ఉన్నా, లేకున్నా శక్తికి మించి ఆర్థికాన్ని ఖర్చు చేసిందన్నారు. ప్రాజెక్టుల పేరుతో దుర్వినియోగం చేశాయని తెలిపారు. టీజీఓ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పదమూడేళ్ల తర్వాత ఈ వేదిక మీదకు వచ్చినట్లు గుర్తు చేశారు. కోదండరామ్‌కు ఎమ్మెల్సీ, మంత్రి అన్నారని, ఇప్పటి వరకు ఏదీ ఇవ్వలేదని అన్నారు. టీఎన్జీఓ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీష్ మాట్లాడుతూ... ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఏది ఏమైనా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఉద్యోగుల సమస్యలను తీసుకెళ్లి పరిష్కరింపజేయాలని ఉద్యోగ జేఏసీ పక్షాన విజ్ఞప్తి చేశారు.

యానిమల్ కీపర్ నిర్లక్ష్యంతోనే సింహం దాడి

క్యూరేటర్ డాక్టర్ సునీల్ హీరేమత్

బహదూర్‌పురా: నెహ్రూ జూలాజికల్ పార్కులోని సమ్మర్ హౌస్‌లో నుంచి బయటకు వచ్చిన సింహం యానిమల్ కీపర్‌ను గాయపరిచిన ఘటనలో యానిమల్ కీపర్ నిర్లక్ష్యమే కారణమని క్యూరేటర్ డాక్టర్ సునీల్ హీరేమత్ పేర్కొన్నారు. మంగళవారం ఘటనకు సంబంధించిన వివరాలను క్యూరేటర్ వివరించారు. సమ్మర్ హౌస్‌లో పక్షవాతంతో చికిత్స పొందుతున్న 8 ఏళ్ల ఆడ సింహం (శిరీష) సోమవారం ఉదయం అసిస్టెంట్ యానిమల్ కీపర్ హుస్సేన్‌పై దాడి చేసింది. రాత్రి సింహం ఎన్‌క్లోజర్ శుభ్రపరిచేందుకు వేరే ఎన్ క్లోజర్‌లోకి సింహాన్ని పంపించే సమయంలో గడియ పెట్టడం మరిచిపోవడంతో సోమవారం ఉదయం సింహం బయటకి వచ్చింది. ఎన్‌క్లోజర్‌ను శుభ్రపరుస్తుండగా సింహం ఎదురుగా వచ్చి చెయ్యిపై దాడి చేసిందన్నారు. అప్రమత్తమైన ఇతర సిబ్బంది సింహాన్ని వేరే ఎన్‌క్లోజర్‌లోకి పంపిచేశారు. ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకుంటామని యానిమల్ కీపర్లకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తామన్నారు.

వృద్ధుడి అదృశ్యం


భీమ్‌కార్ బజరంగ్

దూద్‌బౌలి: వృద్ధుడు అదృశ్యమైన ఘటన హుస్సేనీ ఆలం పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఘాన్సీబజార్ ప్రాంతానికి చెందిన భీమ్‌కార్ బజరంగ్(76) ఈ నెల 1న ఉదయం 11 గంటలకు బయటికి వెళ్లి వరకు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు తెలిసిన వారిని, బంధుమిత్రులను ఆరా తీసినా అతని ఆచూకీ తెలియలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 8712660334, 8712661284 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

బోనాల ఉత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ


ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

యాకుత్‌పురా: పాతబస్తీ హరిబౌలీ అక్కన్న మాదన్న మహంకాళి ఆలయం 76వ వార్షిక బోనాల ఉత్సవాల ఆహ్వాన పత్రికను మంగళవారం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మంగళవారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జగన్మోహన్ పర్షాద్, సభ్యులు రాజారత్నం, కృష్ణ, వినోద్, సతీష్, రాజు, శ్రీనివాస్, దినేష్, ముఖేష్ యాదవ్, మహేష్, సాయినాథ్ పాల్గొన్నారు.

'వైద్య వృత్తి ఎంతో పవిత్రమైంది'


అవార్డు గ్రహీతలతో చిన్నారెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చెన్నారెడ్డి అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో మదర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురికి వైద్యరత్న అవార్డులను అందజేశారు. బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మాజీ రాష్ట్ర కార్యదర్శి ఎ.భరత్‌ప్రకాష్, న్యాయవాది డీఎల్ పాడు, సంస్థ వ్యవస్థాపకులు మల్లికార్జున్‌రావు, రాఘవ పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న పోతరాజుల దుస్తుల ప్రదర్శన



చార్మినార్: ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాల్లో పోతరాజులకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. పోతురాజుల ప్రాముఖ్యతను తెలియజేసే విధంగా మదీనా సర్కిల్‌లోని మహ్మద్ క్యాప్ మార్ట్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ ఇలియాస్ బుకారి తన షోరూం వద్ద ఏర్పాటు చేసిన పోతరాజు వేషధారణలోని బొమ్మలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోతరాజులు ధరించే విధంగా తాము ప్రత్యేకంగా పులి చర్మం డిజైన్‌లో దుస్తులతో పాటు హీరా గోలాలను తయారు చేయించామన్నారు. అవసరమైన వారు తమను సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రత్యేక ప్రార్థనలు

గోల్కొండ: గోల్కొండ రిసాలబజార్, మాసాబ్‌ట్యాంక్‌లోని హుమ్యాన్‌నగర్, ఆసిఫ్‌నగర్ తదితర ప్రాంతాలలోని అషూర్‌ఖానాలలో అలంలు కొలువుదీరాయి. సాయంత్రం కాగానే ముస్లింలు అలంలను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. అలంలకు దట్టీలు సమర్పించుకుంటున్నారు. గోల్కొండ రామ్‌దేవ్‌గూడ రోడ్డులోని చారిత్రక అషూర్‌ఖానాలో కొలువుదీరిన అలంలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ ఎత్తున వచ్చి దర్శించుకుంటున్నారు.